యూరియా కొరత లేకుండా ముందస్తు చర్యలు : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రబీ సాగుకు రైతులకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జెసి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ యూరియా కొరత లేదని, రబీకి డిసెంబర్ నెలకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ నెలకు 3,800 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం జిల్లాలో 8,900 మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీలు, ఆర్‌ఎస్‌కె, లైసెన్సు డీలర్ల వద్ద అందుబాటులో ఉందన్నారు. దళారీలు రైతులను ఇబ్బంది పెడితే మండల వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలన్నారు. యూరియాకు సంబంధించి జిల్లాస్థాయిలో 8331056742 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సమస్యలుంటే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమ్మె బాటలో లారీ యజమానులు

పెంచిన ఫిట్‌నెస్ భారం ఉపసంహరించాలని డిమాండ్

ఫిట్‌నెస్ సెంటర్లు స్థానికంగానే నెలకొల్పాలని వినతి

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో నేటి నుంచి తలపెట్టిన సమ్మె తాత్కాలిక వాయిదా

ప్రజాశక్తి - పాలకొల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కసారిగా లారీలతో పాటు రవాణా వాహనాల ఫిట్‌నెస్ ఛార్జీలను రూ.వందల నుంచి రూ.వేలకు పెంచడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా లారీ యజమానులు సమ్మెకు దిగుతున్నారు. ఇప్పటికే తేలికపాటి రవాణా వాహనాలు రావడంతో లారీ యాజమాన్యాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. ప్రస్తుతం కొత్త లారీలు కొనుగోలు చేసి వ్యాపారం చేసేవారే లేరు. గతంలో పాలకొల్లు యూనియన్‌లో 250 నుంచి 300 లారీలు ఉండేవి. ప్రస్తుతం 150 లారీలు మాత్రమే సంఘంలో ఉన్నాయి. అవీ పాత లారీలను బాగు చేసుకుని కేవలం స్థానిక రైల్వే వ్యాగన్ల కోసం ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.1,340 ఉన్న ఫిట్‌నెస్ ఛార్జీలను రూ.33,040కు పెంచడంతో లారీ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో గ్రీన్‌ట్యాక్స్ వేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పన్ను సగానికి తగ్గించింది. అయితే ప్రస్తుతం పన్నుల రూపంలో ఆదాయం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం సైతం పెంచిన ఫిట్‌నెస్ పన్నుపై ఏమీ మాట్లాడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ఇంతవరకూ వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పాలకొల్లులోనే టెస్ట్ చేసేవారు. అయితే ప్రస్తుతం అమలాపురం, రాజమండ్రి, రాజానగరం, విజయవాడలో మాత్రమే ఫిట్‌నెస్ కేంద్రాలు పెట్టారు. భీమవరం దగ్గర మోగల్లులో కూడా పెడుతున్నారు. అసలే అంతంతమాత్రంగా ఉన్న రవాణా వాహనాలు ఈ కేంద్రాలకు వెళ్లాలంటే భారంతో కూడిన పని అని లారీ యజమానులు చెబుతున్నారు. మినీ వ్యాన్, ట్రాక్టర్లు కూడా ఫిట్‌నెస్ కోసం ఆయా కేంద్రాలకు వెళ్లాల్సిందే.

నేటి నుంచి సమ్మె.. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో వాయిదా

లారీ యజమానులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ పెంచిన భారాలను ఉపసంహరించాలని మంగళవారం రాత్రి నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. దీనికి వివిధ రూపాల్లో కూడా సన్నద్ధమయ్యారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సమస్యలపై చర్చ, పరిష్కారానికి నాలుగు రోజులు గడువు కోరడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు లారీ యజమానుల సంఘాలు ప్రకటించాయి.

లారీల సమ్మెతో పలు రంగాలపై ప్రభావం

లారీ యజమానులు సమ్మెకు దిగితే అనేక రంగాలపై ప్రభావం పడనుంది. ప్రస్తుతం ఖరీఫ్ ధాన్యం ముమ్మరంగా కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రవాణా వాహనదారులు సమ్మెకు దిగితే ధాన్యం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తేలికపాటి రవాణా వాహనాలు సైతం సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. దీంతో ఇప్పటికే ఆటుపోట్ల నడుమ ఉన్న నిర్మాణ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉంది. కంకర, మెటల్ లారీలు కూడా ముందుండి సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. ఇప్పటికే లారీ యాజమాన్యాలు రాష్ట్ర రవాణా కమిషనర్ ఎమ్.టి.కృష్ణబాబుతో కలిసి వాహనాల ఫిట్‌నెస్ పన్నును యధాతథంగా ఉంచాలని విజ్ఞప్తి చేసింది. పాలకొల్లు లారీ యజమానులు మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి సమస్యను వివరించారు.

ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టమ్ పాలకొల్లులోనే నెలకొల్పాలి

పైలా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు, పాలకొల్లు లారీ అసోసియేషన్

పెంచిన పన్ను పోటు కాకుండా వాహనాల ఫిట్‌నెస్ కోసం రవాణా వాహనాలు తూర్పుగోదావరి జిల్లాలోని మూడు కేంద్రాలకు వెళ్లాల్సి రావడం భారంతో కూడింది. కాబట్టి భీమవరంతో పాటు పాలకొల్లులోనూ ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ నెలకొల్పాలి. పెంచిన ఛార్జీలు తగ్గించి లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి.

లారీల సమ్మె తాత్కాలిక వాయిదా

ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గురుజు సూరిబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాత వాహనాలపై కేంద్ర ప్రభుత్వం పెంచిన ఫిట్‌నెస్ ఛార్జీలకు వ్యతిరేకంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి తలపెట్టిన లారీల సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఎపి లారీ యజమానుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తాడేపల్లిగూడెం అసోసియేషన్ సెక్రటరీ గురజు సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం పెంచిన ఫిట్‌నెస్, టెస్టింగ్ ఛార్జీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ప్రస్తుతం ఉన్న రేట్లు హోల్డ్ చేస్తామని, అందుకుగాను నాలుగు రోజులు సమయం పడుతుందని వాహన యజమానులు సహకరించాలని కోరడంతో తాత్కాలికంగా సమ్మె విరమింపజేస్తున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలు పైబడిన పాత వాహనాల ఫిట్‌నెస్ ఛార్జీలు పెంచడం వల్ల వాహన యజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన కిరాయిలు లేక ఇబ్బంది పడుతున్న పాత వాహనాల యజమానులకు కేంద్ర ప్రభుత్వం పెంచిన ఛార్జీలు తలమానికమయ్యాయన్నారు. పాత లారీలకు పాత విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చెప్పిన విధంగా నాలుగు రోజుల్లో పెంచిన ఛార్జీలను రద్దు చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి కృషి

కొత్త పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధికి నూతన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. నూతన పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, బ్యాంకు రుణాల మంజూరుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక మండలి, పెట్టుబడిదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాల్లో అభివృద్ధి సంతృప్తికరంగానే ఉందని, పారిశ్రామికంగా అభివృద్ధికి మరింత కృషి చేయాలని అన్నారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు అనేకమంది పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని, నూతన పరిశ్రమల స్థాపనకు అనుమతులు, బ్యాంకు రుణాల మంజూరు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అక్టోబర్ 30 నుండి నేటి వరకు వివిధ శాఖల అనుమతుల కోసం 1,218 దరఖాస్తులు రాగా, 1,170 దరఖాస్తులను ఆమోదించామని, మరో 48 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, డిపిఒ ఎం.రామ్‌నాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ స్వాతి, జిల్లా లేబర్ ఆఫీసర్ ఆకన లక్ష్మి, జిల్లా విద్యుత్ శాఖాధికారి పులి ఉషారాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎన్‌వి.అరుణకుమారి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం

- ఇప్పటి వరకూ 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతులు సమస్యల పరిష్కారానికి క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు
- జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతోందని, ఇప్పటివరకూ రెండు లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 37 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రూ.483.27 కోట్లు, 48 గంటల లోపుగా రూ.18.84 కోట్లు నగదు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా 90 వేల బ్యాగులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి, టెక్నికల్ అసిస్టెంట్‌లతో కిక్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశామని, ఈ టీములు రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లుల వద్ద దిగుమతి చేసుకునేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఇబ్బంది ఉంటే కిక్ రెస్పాన్స్ టీంలను సంప్రదించాలన్నారు. వీరి ఫోన్ నెంబర్లు రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని తెలిపారు. అలాగే కలెక్టరేట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ 24/7 పనిచేస్తుందని తెలిపారు. మిల్లర్లతో ఇబ్బంది ఉన్నా, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది స్పందించకపోయినా వెంటనే ఫోన్ చేస్తే కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. తేమశాతం ఎక్కువగా ఉంది, ధాన్యం సరిగ్గా లేదు, నాణ్యత లేదు అని ఎవరు చెప్పినా వినొద్దని, రైతు సేవా కేంద్రాలను మాత్రమే సంపాదించాలని తెలిపారు. 40 కేజీలు 600 గ్రాములు మాత్రమే తూకం పట్టాలని, తేమ శాతం సాకుగా చూపించి 41 కేజీలు లేదా 42 కేజీలు పట్టే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఎరువుల షాపుల తనిఖీ

భీమవరం టౌన్ : మంగళవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి భీమవరం దిరుసుమర్రు రోడ్డులోని సత్య శ్రీనివాస్ ఎంటర్ప్రైజెస్ ఎరువులు, పురుగుమందుల షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్ ప్రకారం షాపులో, గొడౌన్‌లో ఉన్న స్టాకును స్వయంగా పరిశీలించారు. రైతులకు యూరియా బస్తాలు అమ్ముతున్న ధరలను బిల్లు బుక్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా రబీ సాగుకు ఎటువంటి యూరియా కొరత ఉండదని, రైతులు ఆందోళన చెందొద్దని, అవసరం మేరకు యూరియా కొనుగోలు చేసుకోవాలని, ఒకేసారి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని తెలిపారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎడి కెఎఎస్‌ఎస్.శ్రీనివాస్, టెక్నికల్ ఎఒ కృష్ణ కాంత్ ఉన్నారు.

వెలుగులోకి మరో యానిమేటర్ కుంభకోణం!

డ్వాక్రా మహిళ ఆత్మహత్యాయత్నం

ఐద్వా ఆధ్వర్యాన బ్యాంకు వద్ద నిరసన

డ్వాక్రా మహిళలను ఆదుకోవాలని డిమాండ్

బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి - ఆకివీడు

స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) యానిమేటర్ల మోసాల పరంపర కొనసాగుతోంది. రోజుకో కొత్త అంశం వెలుగు చూస్తోంది. నాలుగు రోజులుగా స్థానిక సంతపేటలోని 40 గ్రూపులను మోసం చేసి పరారైన యానిమేటర్ సుధ కథ నడుస్తుండగా మంగళవారం మరో యానిమేటర్ మోసం వెలుగులోకి వచ్చింది. స్థానిక సమతా నగర్‌లోని 30 గ్రూపులకు సంబంధించి యానిమేటర్ హేమలత అక్రమాలు వెలుగులోకి వచ్చాయని గ్రూపు సభ్యులు తెలిపారు. తమ మూడు గ్రూపులకు చెందిన సుమారు 15 నుంచి రూ.20 లక్షలు మాయమయ్యాయని వారు తెలిపారు. వీరిలో అక్షర జ్ఞానానికి నోచుకోని సంచార జాతులకు చెందిన చెంచుల గ్రూపులు రెండు ఉన్నాయి. వారు గత దశాబ్ద కాలం నుంచి ఇక్కడ స్థిరపడ్డారు. కొంతకాలంగా డ్వాక్రా గ్రూపులుగా ఏర్పడి పొదుపు ప్రారంభించారు. ఇప్పుడు మోసానికి గురయ్యారు. ఇక్కడ మొత్తం 30 గ్రూపుల్లో మూడు గ్రూపులకు చేసిన మోసం ఇప్పటివరకూ వెలుగు చూసిందని, మిగిలిన గ్రూపులను పూర్తిగా పరిశీలిస్తున్నామన్నారు. మొత్తం గ్రూపులు పరిశీలిస్తే కోటి రూపాయలపైనే కుంభకోణం వెలుగు చూడొచ్చని భావిస్తున్నారు. రెండో యానిమేటర్ కూడా కోటి రూపాయలు అయితే రూ.రెండున్నర కోట్ల కుంభకోణం బయటపడినట్లు అవుతుందని, మొత్తం నలుగురు యానిమేటర్లు ఈ రకంగా అక్రమాలకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే ఇందులో యానిమేటర్ పాత్ర ఎంత, బ్యాంక్ అన్నది పూర్తి విచారణ జరిగితే తప్ప తేలే పరిస్థితి కనిపించడం లేదు.

బ్యాంకు నుంచి గ్రూపులకు రుణం మంజూరు చేయడం బ్యాంకర్ వల్ల మాత్రమే జరుగుతుంది. గ్రూపులకు తెలియకుండానే ఆయా గ్రూపుల ఖాతాలో డబ్బులు జమ అయ్యాయని, ఇలా జమకావడం విచిత్రంగా ఉందంటున్నారు. అయితే గ్రూపు ఉమ్మడి ఖాతా నుంచి సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు జమ కాకుండానే వారి పేర్లతో ఖర్చు రాయడం విచిత్రంగా ఉందని చెబుతున్నారు. అలాగే ఈ డబ్బులు గ్రూపునకు సంబంధం లేని వారి ఖాతాల్లో జమ అయ్యాయని కొందరు చెబుతున్నారు.

డ్వాక్రా మహిళ ఆత్మహత్యాయత్నం..

ఈ కుంభకోణం నేపథ్యంలో సమతానగర్‌లోని ఝాన్సీ గ్రూపునకు చెందిన సభ్యురాలు వి.లత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఆమెవి రూ.రెండు లక్షలు పోయాయని తెలియడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని గ్రూపు సభ్యులు చెబుతున్నారు. పురుగులు మందు తాగిన ఆమెను స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి అక్కడ నుండి భీమవరం ఆసుపత్రికి తరలించారని తెలిసింది. ప్రస్తుతం లత ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెబుతున్నారు.

ఐద్వా ఆధ్వర్యాన నిరసన

డ్వాక్రాలో జరిగిన భారీ మోసంపై ఐద్వా నేతలు బ్యాంకు వద్ద మంగళవారం నిరసన తెలిపారు. డ్వాక్రా సభ్యులు భారీగా నష్టపోయారని, ఇంత నష్టం ఒక యానిమేటర్ వల్ల సాధ్యమేనా అని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సందక ఉదయ కుమారి, డోకల లక్ష్మి, డి.కళ్యాణి బ్యాంకు మేనేజర్ రమేష్‌ను ప్రశ్నించారు. బ్యాంకర్ సహకారం లేకుండా బ్యాంకు నుంచి డబ్బులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, నష్టపోయిన డ్వాక్రా మహిళలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

12న కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

42 రోజుల సమ్మె హామీల అమలు కోరుతూ నిరసన - అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి

ప్రజాశక్తి - భీమవరం

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపులో భాగంగా ఈ నెల 12వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో నాయకురాలు ఎండి హసీనా బేగం అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఆ పోరాట సమయంలో ప్రతి పక్షంగా ఉన్న కూటమి పార్టీలు ధర్నాకు మద్దతుగా వచ్చి తాము అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామన్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా అంగన్వాడీల జీతాల సమస్యను పరిష్కారం దిశగా ఆలోచించడం లేదని వాపోయారు. పెరిగిన ధరలతో చాలీచాలని వేతనాలతో అంగన్వాడీలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రీస్కూల్‌కు ప్రయివేటు కాన్వెంట్లకు అనుమతులు ఇవ్వడంతో అంగన్వాడీలకు వచ్చే పిల్లల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని, అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు యూనిఫామ్, స్నాక్స్ ఇవ్వాలని తెలిపారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, కొత్త ఫోన్లు ఇవ్వాలని, యాప్‌ల పని భారాన్ని తగ్గించాలనే డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాలో జిల్లాలోని అంగన్వాడీలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సమస్యలు పరిష్కరించుకునే దిశగా ముందుకు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సిహెచ్.ఉషారాణి, కె.తులసి, సిహెచ్.మహాలక్ష్మి, పైడేశ్వరి, మధుశీల, విజయలక్ష్మి, శ్యామలా కుమారి పాల్గొన్నారు.

మంత్రివర్యా.. మీరున్నా ఇంతేనా..!

సమాచార శాఖలో సమస్యల తిష్ట

సిబ్బంది కొరత, సదుపాయాలలేమితో నిత్యం ఇబ్బందులే

కీలకమైన డిపిఆర్‌ఓ పోస్టు ఖాళీ, డిఎల్‌పిఆర్‌ఒ, ఎపిఆర్‌ఒ పోస్టులూ అంతే

వాహనాలు మూలనపడ్డా పట్టించుకునేవారే కరువు

శాఖపై అనుభవం లేని అధికారి డిఐపిఆర్‌ఒగా నియామకం

సమాచారశాఖ మంత్రి సొంత జిల్లాలోనే సమస్యలకు మోక్షం కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వానికి వెన్నుముకగా నిలిచే జిల్లాలోని సమాచార శాఖను పట్టించుకునే వారే లేకపోయారు. సమాచార శాఖా మంత్రి జిల్లాలోని సమస్యలకు మాత్రం మోక్షం కలగడం లేదు. పోస్టులన్నీ ఖాళీ అయిపోవడంతో వార్తల సేకరణకు ఒకేఒక్కరు అన్నట్లు పరిస్థితి తయారైంది. దీంతో ప్రభుత్వ కార్యక్రమాలు, జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాలకు సంబంధించిన వార్తల సేకరణ సమాచార శాఖకు నిత్యం సవాళ్లుగా మారాయి. వార్తల సకాలంలో రాకపోవడంతో ఒకపక్క జర్నలిస్టుల ఒత్తిడి.. మరోపక్క అధికారుల ఒత్తిడితో ఆ శాఖలోని సిబ్బంది అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఏలూరు జిల్లాలోని సమాచారశాఖలో కీలకమైన డిపిఆర్‌ఒ (జిల్లా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్) పోస్టు ఖాళీగా ఉంది. డిపిఆర్‌ఒగా పని చేసిన అధికారికి ఉద్యోన్నతి రావడంతో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయారు. మరో అధికారిని నియమించకపోవడంతో డిపిఆర్‌ఒ పోస్టు ఖాళీగానే ఉంది. ఎపిఆర్‌ఒ పోస్టులు రెండు ఉండగా, ఒకరు మాత్రమే పని చేస్తున్నారు. డిపిఆర్‌ఒ పోస్టులు రెండు ఉండగా ఒక పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. పబ్లిసిటీ అసిస్టెంట్లు నలుగురు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేకుండాపోయారు. ప్రస్తుతం వార్తల సేకరణకు ఒకేఒక్క ఎపిఆర్‌ఒ మిగిలారు. దీంతో ప్రభుత్వ, జిల్లా కలెక్టర్ కార్యక్రమాలకు సంబంధించిన వార్తల సేకరణ సమాచార శాఖ సిబ్బందికి తీవ్ర కష్టంగా మారింది. ఇక సిఎం, మంత్రుల పర్యటనలు ఉంటే వారి పరిస్థితి అగమ్యగోచరమే అన్నట్లు తయారైంది. సమాచారశాఖలో ఇబ్బందుల గురించి జిల్లా అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా సమాచారశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన కొలుసు పార్థసారధి ఉన్నారు. అయినప్పటికీ జిల్లా సమాచారశాఖలో ఇబ్బందులకు మోక్షం మాత్రం లభించడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు తెలిసేలా చేయాలన్నా, జిల్లా అధికారుల నిర్ణయాలు ప్రజలకు చేరవేయాలన్నా సమాచార శాఖది కీలక పాత్ర. అటువంటి శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. జిల్లా సమాచారశాఖలో డిఐపిఆర్‌ఒ (జిల్లా ఇన్‌ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్) పోస్టు అత్యంత కీలకం. జిల్లా సమాచార శాఖ ఉన్నతాధికారిగా ఆ శాఖను నడిపించాల్సి ఉంటుంది. అలాంటి పోస్టులో రేడియో ఇంజినీర్ విభాగానికి సంబంధించిన అధికారిని నియమించారు. ఆయనకు సమాచారశాఖ విభాగంపై ఏమాత్రం అనుభవం లేదు. దీంతో ఆ శాఖను ముందుకు నడిపించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వార్తల సేకరణ సైతం చేయగలిగి, ఆ శాఖలో పూర్తి అనుభవం ఉన్న సామర్థ్యం ఉన్న అధికారిని డిఐపిఆర్‌ఒగా నియమించాల్సి ఉంది. అంతేకాకుండా వెంటనే రాష్ట్ర కేంద్రం నుంచి అవుట్ సోర్సింగ్ విధానంలోనైనా రెండు పిఆర్‌ఒ పోస్టులను భర్తీ చేయడంతోపాటు, ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాల్సి ఉంది. దీనిపై సమాచార శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తే సమస్యలకు కొంతమేరైనా పరిష్కారం లభిస్తుంది. సమాచారశాఖలో అత్యంత ముఖ్యమైన ఫొటోగ్రాఫర్ పోస్టు నియామకం లేకపోవడం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తోంది.

మూలన పడ్డ వాహనాలు

సమాచార శాఖకు సంబంధించిన వాహనాలు పూర్తిగా మూలనపడ్డ పరిస్థితి ఉంది. ఏదైనా ప్రభుత్వ కార్యక్రమాలకు మీడియా ప్రతినిధులను తీసుకువెళ్లేందుకు స్వరాజ్‌మజదా వాహనం ఉండేది. అది పూర్తిగా దెబ్బతిని మూలకు చేరింది. ఆ స్థానంలో కొత్త వాహనం కొనుగోలు చేయాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. జిల్లా సమాచారశాఖ అధికారికి కేటాయించిన బొలేరో వాహనం వచ్చి 15 ఏళ్ల గడిచిపోయింది. తరచూ మరమ్మతులకు గురవడంతో అధికారులు నానావస్థలు పడుతున్నారు. ఇటీవల ఉంగుటూరు మండలంలో సిఎం పర్యటనకు వెళ్లేముందు వాహనం స్టార్ట్ కాకపోవడంతో సమాచారశాఖ అధికారులు సైతం మీడియా ప్రతినిధులతోపాటు బస్సులో వెళ్లాల్సి వచ్చింది. కొత్త వాహనాలు ఏర్పాటు చేయకపోతే మున్ముందు సమాచార శాఖ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. సమాచార శాఖ మంత్రి జిల్లాకు చెందినవారే. వెంటనే జిల్లా సమాచారశాఖలో సమస్యలను పరిష్కరిస్తే ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

నిరంతర పర్యవేక్షణతో పంటు నిర్వహించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

కనీస ప్రమాణాలు పాటించకుండా గోదావరిపై పంటు నిర్వహిస్తుంటే సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రేవులో పంటుల రాకపోకలను నిలుపుదల చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ నరసాపురం టు సఖినేటిపల్లి గోదావరి పంటుపై ప్రయాణం ప్రాణాంతకంగా మారిందన్నారు. ఆదివారం 80 మంది ప్రయాణికులు, వివిధ వాహనాలతో వెళ్తున్న పంటు ఇంజన్ ఆగిపోవడంతో గోదావరి మధ్యలో నిలిచిపోయిందని, తృటిలో ప్రమాదం తప్పిందనితెలిపారు. ఇలాంటి ప్రమాదకరమైన సంఘటనలు పంటు నిర్వహణలో జరుగుతుంటే సంబంధిత ప్రభుత్వ అధికారులు చూసీచూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటు నిర్వహణలో కనీస ప్రమాణాలు పాటించకుండా పంటు ఏ రకంగా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలోతొక్కి అధిక జనాభా, వాహనాలను ఎక్కించడం ఏంటని ప్రశ్నించారు. ప్రయాణికుల నుండి టికెట్ అధిక ధర వసూలు చేస్తున్నారన్నారు. రెవెన్యూ, పోలీస్, మండల్ పరిషత్ అధికారులు నిరంతర పర్యవేక్షణలో పంటు నిర్వహించాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నోముల కొండ, కోడి లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు గుత్తుల శ్రీరామచంద్రుడు, కమిటీ సభ్యులు ఎం.మల్లేష్, బి.అప్పారావు, ఎస్.దుర్గారావు, ఎస్.రాజు, ఎం.సురేష్ పాల్గొన్నారు.

రైతులకు కొత్త గోనె సంచులు ఇవ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

చిరిగిన గోనె సంచులు చూపిస్తున్న రైతులు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు కొత్త గోనె సంచులు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అశ్రియ్య డిమాండ్ చేశారు. పాలకోడేరు రైతు సేవా కేంద్రం వద్ద ప్రభుత్వం నిల్వ చేసిన గోనె సంచులు చిరిగినవి అందించడంతో సిపిఎం ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశ్రియ్య మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు అనేక కష్టాలకు ఓర్చి సాగు చేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కష్టపడి ధాన్యం పండిస్తే దాని కొనుగోలుకు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ధాన్యం కొనుగోలుకు చెరిగిపోయిన సంచులు ఇస్తే రైతులు ఏ విధంగా పట్టుబడులు పడతారని ప్రశ్నించారు. ఇప్పటికే రైతులకు సరైన దిగుబడి లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే కనీసం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కూడా ప్రభుత్వం నాణ్యమైన సంచులు అందించకపోవడం అన్యాయమన్నారు. తక్షణం రైతులకు నాణ్యమైన గోనె సంచులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు అప్పలరాజు, సుబ్బరాజు, వెంకటరావు, నాయకులు దున్న మరియమ్మ, రామానుజ దాస్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - ఉండి

ఆహారం అందిస్తున్న శశి స్కూల్ సిబ్బంది

ఏ ఆసరా లేని వృద్ధులకు తమ విద్యార్థుల సహకారంతో అన్నదానం నిర్వహించడం ఆనందదాయకంగా ఉందని ఉండి శశి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఇందుకూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మహదేవపట్నం గ్రామంలోని సన్‌రైజ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రెండు పూటలా భోజన వసతి, ఉదయం టిఫిన్ శశి స్కూల్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఏర్పాటుచేసిన డొనేషన్ బాక్స్‌లో విద్యార్థులు పుట్టినరోజులకు సంబంధించి వేసిన నగదును వృద్ధులకు, నిరు పేదలకు ఆహారం పంపిణీ చేసేందుకు ఉపయోగించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం చేపట్టినందుకు ఆనందంగా ఉందన్నారు. వృద్ధులు, శశి స్కూల్ విద్యార్థులు ఉన్నారు.

ఎక్కడ చూసినా చెత్తే..!

మున్సిపల్ కమిషనర్‌పై ఎంఎల్‌ఎ ఫైర్

నరసాపురం: మున్సిపల్ కమిషనర్ అంజయ్య పని తీరుపై విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మండిపడ్డారు. పట్టణంలోని డంపింగ్ సమస్య తలెత్తడానికి 'నీ పనితీరే కారణం, అవసరమైతే సెలవు పెట్టి వెళ్లి పోవాలని' ఎంఎల్‌ఎ ఫైర్ అయ్యారు. సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ఈ రోజు ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయింది. దీన్ని యుద్ధ ప్రాతిపదికన క్లీన్ చేయాలని, అవసరమైతే లారీలు ఏర్పాటు చేసి గుంటూరు జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో ఆర్‌డిఒ దాసిరాజుతో కలిసి విప్ నాయకర్ మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. శానిటరీ అధికారులు, సిబ్బందితో వారు సమీక్ష నిర్వహించారు. కొంత మంది వైసిపి కౌన్సిలర్లు డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కాకుండా చూస్తున్నారన్నారు. ఇది ప్రజలకు తెలియజేసేందుకు ఎవరు వ్యతిరేకిస్తున్నారో వారి ఇంటి ముందు చెత్త వేయాలన్నారు. అప్పుడే పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య వారికి తెలుస్తుందన్నారు. అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయానికి సిమెంటు బెంచి బహూకరణ

తాడేపల్లిగూడెం: పట్టణ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో పాఠకుల సౌకర్యార్థం మంగళవారం బ్రహ్మశ్రీ రామాంజనేయులు లైబ్రరీ ప్రాంగణంలో సిమెంట్ బెంచి బహూకరించినట్లు గ్రంథాలయాధికారి వైవి.సాయి బాబా తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పూర్వ అధికారి వి.శ్రీనివాసరావు, బుక్ రీడర్ అసోసియేషన్ కార్యవర్గం గరికిపాటి బాపయ్యశర్మ, జనార్ధన్ రావు, ఎవి.లక్ష్మణరావు, కోపెల్ల శ్రీనివాసరావు, లైబ్రరీ సహాయకులు మధు, కెవి.సత్య ప్రకాష్, కె.బాపూజీ, పాఠకులు, గ్రంథాలయాధికారులు రామాంజనేయులను అభినందించారు.

నాపై దాడి చేశారు : సాయిబాబు

మొగల్తూరు: వైసిపి నుంచి జనసేనలోకి వెళ్లిన ముగ్గురు వ్యక్తులు తనపై దాడి చేసి, కొట్టి గాయపరిచారని కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన బాలం సాయిబాబు ఆరోపించారు. మంగళవారం మొగల్తూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపిలో ఉంటూ దందాలకు పాల్పడుతున్న బాలం దాసు, బాలం రాజేష్, మోటూరి ఏసు రాజులు వ్యవహారంపై అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. అదే వ్యక్తులు ఇటీవల జనసేనలోకి చేరారని ఆయన తెలిపారు. ఆ పార్టీ అధికారాన్ని, సామాజిక తరగతిని అడ్డుపెట్టుకుని రౌడీయిజం చేస్తూ సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తాను వైసిపి అధిష్టానానికి ఫిర్యాదు చేశానని కక్ష పెంచుకుని తనపై కత్తులు, కొడవళ్లతో నాలుగు రోజుల కిందట దాడి చేశారన్నారు. తాను ఆసుపత్రిలో నాలుగు రోజులుండి చికిత్స పొందానని ఆయన తెలిపారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

డిఎ, డిఆర్‌లను మంజూరు చేయాలి

పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు బి.హరికుమార్

తాడేపల్లిగూడెం: పెన్షనర్లకు మంజూరు చేయవలసిన మూడు డిఎ, డిఆర్‌లను వెంటనే మంజూరు చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.హరికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ యూనిట్ సంఘ భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 జులై 1 నుండి పెన్షనర్లకు చెల్లించవలసిన డిఆర్ బకాయిలు, 11వ పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలని, తక్షణమే 12వ వేతన సంఘం కమిషనర్‌ను నియమించి ఉద్యోగులకు, పెన్షనర్లకు 30 శాతం ఇంటిరిమ్ రిలీఫ్, తాత్కాలిక భృతి చెల్లించాలని, పెన్షనర్లకు తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ పెన్షన్‌ను వెంటనే తిరిగి 70 సంవత్సరాల వారికి 10 శాతం, 75 సంవత్సరాల వారికి 15 శాతంగా పునరుద్ధరించాలని కోరారు. అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం ఈనెల 17న జరపాలని నిర్ణయించారు. అనంతరం భీమవరం మాక్సివిజన్ కంటి ఆసుపత్రిచే పెన్షనర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు.

ఘనంగా సోనియాగాంధీ పుట్టినరోజు

పాలకొల్లు : కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ 79వ పుట్టినరోజు పాలకొల్లు కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ బొమ్మల సెంటర్ వద్ద కూడా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గోగులమండ భాస్కరరావు, పాలకొల్లు కోఆర్డినేటర్ కొర్రగింజల హరికిరణ్, పిసిసి సభ్యులు, షేక్ మహబూబ్ జానీ, రొక్కల బెన్నీపాల్, యలమర్తి మోహనరావు, ముడకాల గోపాలరావు, ఖండవల్లి ప్రభుదాసు పాల్గొన్నారు.

జాతీయ నేతల విగ్రహాలకు ప్రాధాన్యతనివ్వాలి

స్థానికుల ఆరోపణ

మొగల్తూరు: కీర్తిశేషులు, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి తగిన గౌరవం లభించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో జాతిపిత మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాలు ఉన్నాయి. దేశ నాయకుల విగ్రహాలు గౌరవించుకోటానికి లేకుండా అడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా విగ్రహాలకు రాజకీయ నాయకులు తమ ఫ్లెక్సీలు పడిపోకుండా ఇందిరా గాంధీ విగ్రహంకు భుజంపై కర్ర పెట్టి జారిపోకుండా మెడకు తాడు బిగించి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీనిపై పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నాయకులకు గౌరవం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఒ స్పందిస్తూ విగ్రహం మెడలోని తాడును వెంటనే తొలగిస్తామని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి : ఎంఎల్‌ఎ

నరసాపురం: పేదలకు మెరుగైన వైద్యం అందిచేలా వైద్యులు, సిబ్బంది కృషిచేయాలని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం నరసాపురం ఏరియా ఆసుపత్రిని ఆర్‌డిఒ దాసిరాజుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రతి విభాగాన్ని పరిశీలిస్తూ డాక్టర్లు, నర్సులు విధుల్లో సమయానికి ఉన్నారో లేదో వ్యక్తిగతంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగం నుండి ఔషధాల పంపిణీ కేంద్రం వరకు అన్ని సేవల పనితీరును పరిశీలించారు. శుభ్రత, పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్యసేవల స్థాయిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు ఏమిటో తెలుసుకున్నారు. చికిత్స నాణ్యత, డాక్టర్ల స్పందన, సిబ్బంది ప్రవర్తనపై రోగుల అభిప్రాయాలు విన్నారు. వెంటనే పరిష్కరించవలసిన అంశాలను సంబంధిత విభాగాధిపతులకు ఆదేశించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్కరణలు తీసుకు వస్తామని తెలిపారు.

ఘనంగా ఎంఎల్‌ఎ పితాని పుట్టినరోజు

పెనుమంట్ర : టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి, శాసనసభ హక్కుల కమిటీ ఛైర్మన్, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ 74వ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లి పుష్ప గుచ్ఛాలు ఇచ్చి, కేకులు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీరామ దుర్గారెడ్డి, రాష్ట్ర నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆలీజీన్నా తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పాలకొల్లు రైల్వే గేట్ మూసివేత

పాలకొల్లు : పాలకొల్లు రైల్వే గేట్ దగ్గర రోడ్డు మరమ్మతు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం వరకు గేట్ మూసివేస్తారు. ప్రస్తుతం తక్కువ మంది కార్మికులతో పనులు జరుగుతున్నాయి. ఇంకా ఎక్కువ మంది కార్మికులతో పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ఇదిలా ఉండగా గేట్ మూసివేయడంతో పూలపల్లి నుంచి లాకుల వరకు ట్రాఫిక్ బోసిపోయింది. అయితే పూలపల్లి బైపాస్ రహదారి మీద ట్రాఫిక్ తీవ్రంగా పెరిగింది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

జిల్లాలో నాలుగో విడత భూ సర్వే

సర్వేకు సంబంధించి రోవర్లను సిద్ధం చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నాలుగో విడత భూ సర్వేకు సంబంధించి రోవర్లను సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి రోవర్స్ పనితీరును పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో మొత్తం 114 రోవర్లు అందుబాటులో ఉండగా వాటిలో 42 మాత్రమే పనిచేస్తున్నాయని, మిగిలిన వాటిలో కొన్ని రిపేర్లు చేయవలసి ఉండగా కొన్ని రిపేర్లు చేయాల్సి ఉందని జెసికు అధికారులు వివరించారు. రిపేర్ చేయవలసినవి చేయించాలన్నారు. రిపేరు చేయించవలసిన రోవర్స్‌ను వెంటనే రిపేర్ చేయించి, జిల్లాలో నాలుగో విడత భూసర్వే మొదలుపెట్టే నాటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా సర్వే అధికారిని జెసి ఆదేశించారు. జిల్లా సర్వే అధికారులు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డిఐఎస్ఎస్.రాంబాబు, సర్వేయర్లు, సిబ్బంది ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక

డివైఇఒ ఎన్.రమేష్

ప్రజాశక్తి - వీరవాసరం

పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డివైఇఒ ఎన్.రమేష్ ఉపాధ్యాయులకు సూచించారు. వీరవాసరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. వంద రోజుల ప్రణాళిక పాటించి విద్యార్థులంతా పది పరీక్షల పట్ల కేంద్రీకరించే విధంగా ఉపాధ్యాయులు వారిని సన్నద్ధం చేయాలన్నారు. పాఠశాలలో లెక్కల ల్యాబ్‌ను పరిశీలించి విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. తరగతి గదిలో బోధన జరిగే తీరును ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. కార్యక్రమంలో కానుకొలను శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కాయల వీరస్వామి, గజేంద్ర గద్దర్, ఆకుల శ్రీనివాస్, శేఖర్‌లు ఉన్నారు.


వృద్ధులను సత్కరిస్తున్న వడ్డీ రఘురామ్

ఘనంగా వైఎస్.భారతి పుట్టినరోజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి రాష్ట్ర రైతు విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్(ఆక్వా కల్చర్) వడ్డీ రఘురామ్ నాయుడు ఆధ్వర్యాన మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సతీమణి వైఎస్.భారతి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల వృద్ధాశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించి, వారిని వడ్డీ రఘురామ్ సత్కరించారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే లక్షణాన్ని పొనికి పుచ్చుకున్న మహిళ భారతి అని, ఎన్ని కష్టాలు వచ్చినా ఎప్పుడూ చలించకుండా పేదలకు, ప్రజలకు అందుబాటులో ఉన్న వ్యక్తి భారతి అని కొనియాడారు. ఆమె నిండు నూరేళ్ల పాటు సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎంపిపి శేషులత, కొప్పుల వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీను, సర్పంచి ఎలిపే గాంధీ, మాజీ సర్పంచ్లు వింజుమూరి శ్రీనివాస్, మాకరాజు సతీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండల స్థాయిలో సైన్స్ ఫెయిర్ జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల లంకలకోడేరులో నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో మండల పరిధిలో గల అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 17 పాఠశాల నుండి 32 మంది ఉపాధ్యాయులు, 111 మంది విద్యార్థులు 7 థీమ్స్ సంబంధించిన ప్రదర్శనలతో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జెడ్‌పిహెచ్ స్కూల్ లంకలకోడేరు ప్రధానోపాధ్యాయులు కె.రాజశేఖర్ కన్వీనర్‌గా, మండల విద్యాశాఖ అధికారి ఆర్‌ఎన్‌విఎస్‌జి.శర్మ, గుమ్మళ్ల వీరస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. విజేతలుగా వేస్ట్ మేనేజ్మెంట్‌లో బివిఆర్‌ఎం గర్ల్స్ హైస్కూల్, గ్రీన్ ఎనర్జీలో జెడ్‌పిహెచ్ లంకలకోడేరు, ఎమర్జింగ్ టెక్నాలజీలో జెడ్‌పిహెచ్ స్కూల్ లంకలకోడేరు, హెల్త్ అండ్ హైజిన్‌లో ఎవిఎస్‌ఎన్‌ఎం మున్సిపల్ హై స్కూల్ విజేతలుగా ఎంపికయ్యారు. వీరు త్వరలో జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. విజేతలను ఎంఇఒ ఆర్‌ఎన్‌విఎస్‌జి.శర్మ, గుమ్మళ్ల వీరాస్వామి అభినందించారు. కార్యక్రమంలో సిఆర్‌ఎంటి ఉపాధ్యాయులు జగదీష్, జనార్ధన్‌రావు సహాయ సహకారాలు అందించారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ డిపార్ట్మెంట్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎంబాడెడ్ సిస్టమ్స్‌ను వెక్టర్ ఇండియా సహకారంతో నూతనంగా ఏర్పాటు చేశారు. దీనిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఇసిఇ హెడ్ డాక్టర్ ఎస్ఎస్.మోహన్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వెక్టార్ ఇండియా మేనేజర్ జి.సతీష్ మాట్లాడుతూ పరిశ్రమలు విద్యాసంస్థల మధ్య అనుబంధం పెంచేందుకు ఇటువంటి ఎక్సలెన్సీ సెంటర్లు ఎంతగానో దోహద పడతాయని పేర్కొన్నారు. ఎక్సలెన్స్ సెంటర్ వల్ల విద్యార్థులకు నూతన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఐడియేషన్ ల్యాబ్ ఫెసిలిటీస్‌తో పాటు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్, మైక్రో కంట్రోలర్స్ వాటిపై పూర్తిస్థాయి అధ్యయనం చేయటానికి వర్చువల్ వర్క్ షాప్‌లు కూడా ఈ ఎక్స్ లెన్స్ సెంటర్ ద్వారా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి ఇందుకూరు కిషోర్ పాల్గొన్నారు. ఇసిఇ డిపార్ట్మెంట్‌కు అధునాతనమైన ఎక్సలెన్స్ సెంటర్ హార్డ్‌వేర్ కిట్ ను అందించిన పూర్వ విద్యార్థి విశ్వనాథరాజుకు ఇసి హెడ్ డాక్టర్ ఎస్-ఎస్.మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి

రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు కోసూరి రామకృష్ణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యాన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు చేసి సలహాలు సూచనలు తెలియజేశారు. రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు కోసూరి రామకృష్ణ ఆనందరాజు మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా రక్త శాతం పరీక్షలు, ఇతర పరీక్షలు చేయించుకుని, బిడ్డ ఎదుగుదలకు అదనపు పోషకాహారం తీసుకోవడం ఎంతైనా అవసరమని, రక్తహీనతకు గురికాకుండా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని తెలియజేశారు. డాక్టర్ నవ్యజీవన్ మాట్లాడుతూ ప్రమాదకర లక్షణాలు గల గర్భిణులు తరచూ పరీక్షలు చేయించుకుంటూ ప్రసవ సమయంలో ఏరియా హాస్పిటల్ గైనకాలజిస్ట్ ను సంప్రదించాలని తెలియజేశారు. 35 మంది గర్భిణులకు పోషకాహార కిట్లు, పెరుగన్నం బాక్సులు అందించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, డాక్టర్ జి.దినేష్, రోటరీ అధ్యక్షులు డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు, కార్యదర్శి పోతాబత్తుల సత్యనారాయణ, కోశాధికారి గన్నబత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపవరం: ఆరోగ్యంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో జరిగిన ఆశాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆకుపచ్చని కూరలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవి గురికాకుండా ఉండాలన్నారు. యుక్తవయస్సు ఆడపిల్లలు ఆకుకూరలు తీసుకోవటం వల్ల రక్తహీనతను నివారించవచ్చునని చెప్పారు. ప్రతి ఆశా దగ్గర ప్రెగ్నెన్సీ కిట్లు పది ఉండాలని తెలిపారు. ఎన్‌సిడిసిడి సర్వే ఈనెలాఖరు లోపు స్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువుల ఆసుపత్రి..!

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురులో శిథిలావస్థలో ఉన్న పశువుల ఆసుపత్రి

రాయకుదురులో పశువుల ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకుంది. పైన పటారం లోన లొటారం అన్న చందంగా ఈ పశువుల ఆసుపత్రి ఉంది. 1998లో దాత జి.వెంకటరామకృష్ణ ఆర్థిక సహకారంతో రైతు కమిటీ ఆధ్వర్యాన ఈ ఆసుపత్రిని నిర్మించారు. రెండు గదులతో ఉన్న ఆసుపత్రి శ్లాబ్ నుండి వర్షం నీరు లీకేజీ అవుతుంది. సరైన కిటికీలు లేక అట్టలతో మూసి ఉంచుతున్నారు. ఆసుపత్రి వెనకాల గుమ్మానికి తలుపులు లేకపోవడంతో ఇతరులు ఎవరూ లోనికి వెళ్లకుండా ఒక రేకు ముక్కను అడ్డంగా ఉంచుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆసుపత్రికి ఏవిధమైన రక్షణా లేకుండా పోయింది. పశువులకు అవసరమైన విలువైన మందులు వర్షానికి తడిసిపోవడం జరుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రి పునర్నిర్మాణానికి నిధులు సమకూర్చాలని రైతులు కోరుతున్నారు.

బొబ్బిలి వంతెన మరమ్మతు పనుల పరిశీలన

వంతెన పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం బొబ్బిలి వంతెన పనులు త్వరగా పూర్తిచేయాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అధికారులకు ఆదేశించారు. మంగళవారం ధర్మరాజు కూటమి నాయకులతో కలిసి వంతెన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపవరం వెంకయ్య వయ్యేరుపైన ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంటే వంతెన మరమ్మతులకు తన కృషితో సమకూరిన నిధులతో మరమ్మతులు చేయటం జరుగుతుందన్నారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. బొబ్బిలి వంతెన ప్రాధాన్యత కలిగి ఉందని, ఈ వంతెనపై నుండి నారాయణపురం జాతీయ రహదారి ఏలూరు, భీమవరం సత్తెనపల్లి, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వంతెన శిథిలావస్థకు చేరటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటం వల్ల ముందస్తుగా మరమ్మతులు ప్రారంభించామని చెప్పారు. ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మూరా అలంకారం, కూటమి నాయకులు, వీరమహిళలు, తెలుగు మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ పురుషుల సమానత్వాన్ని సాధిద్దాం

ప్రజాశక్తి - పెనుగొండ

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

సమాజంలో అనేక విధమైన హింసలు జరుగుతున్నాయని, సామాజిక హింస, పని ప్రదేశాల్లో హింస, డిజిటల్ హింస అనేక రకాలుగా మహిళల్ని, బాలికలను ఇబ్బంది పెడుతున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తెలిపారు. హింసను వ్యతిరేకిద్దాం.. స్త్రీ పురుషుల సమానత్వాన్ని సాధిద్దామని పెనుగొండ ఎస్‌వికెపి జూనియర్ కాలేజీలో ప్రిన్సిపల్ అధ్యక్షతన మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్లో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ పాల్గొని మాట్లాడుతూ మహిళకు సమాన పనికి సమాన ఆదాయం ఇవ్వటం లేదని, షాపింగ్ మాల్స్‌లో ఎక్కువగా మహిళల్ని పెట్టుకుని వాళ్ల శ్రమను దోపిడీ చేస్తున్నారని, కుటుంబ అవసరాల రీత్యా మహిళలు కూడా కష్టపడవలసి వస్తుందన్నారు. బయటికి వెళ్లే పనిలో హింసకు గురవుతున్నారని, ఈ హింసను అరికట్టవలసిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా అమలు సరిగ్గా జరగటం లేదని ఆమె విమర్శించారు. కోశాధికారి ఎస్.జైప్రభ మాట్లాడుతూ సమాజంలో బాలికల మీద దాడులు విపరీతంగా పెరిగాయని, ఇంటిలో మగ పిల్లలకి కూడా మహిళలు, బాలికలపై ఏవిధంగా వ్యవహరించాలో కూడా తల్లిదండ్రులు బాధ్యత తీసుకుని నేర్పాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కేత పద్మజ మాట్లాడుతూ ముగ్గురు అక్క చెల్లెళ్ల త్యాగ ఫలితంగా అంతర్జాతీయ ఐక్యరాజ్యసమితి హింస వ్యతిరేక దినోత్సవాన్ని ఈనెల 25న ప్రకటించిందని, ఈనెల 10 వరకు 16 రోజులపాటు మహిళలపై జరిగే హింసను అరికట్టాలని సెమినార్‌లు, సదస్సులో నిర్వహిస్తున్నామన్నారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, అనేక రూపాల్లో మహిళలు హింసను ఎదుర్కొంటున్నారని, వాటి కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.శకుంతల, నాగిశెట్టి భవాని, అంగన్వాడీ టీచర్ తులసి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ పరిస్థితులు కల్పించాలని, పురుషులు, మహిళలు సమానమైన పని విధానమైన మహిళలకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని ప్రముఖ న్యాయవాది ఎన్.సత్యవిజ్ఞాన దేవి పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఇంటర్నల్ కమిటీ ఆధ్వర్యాన 'స్టే ఫర్ సేఫ్టీ యాన్ ఇన్సైట్ ఇన్ టుది లా' అనే అంశంపై విద్యార్థులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఇంటర్నల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పివిఎస్.లక్ష్మి అపర్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది సత్యవిజ్ఞాన దేవి మాట్లాడుతూ చట్టాలు ఉన్నప్పటికీ మహిళల పట్ల జరుగుతున్న దారుణాలను ఆమె విద్యార్థుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిని అధిగమించేందుకు చట్టాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని, అప్పుడే తమను తాము రక్షించుకోగలరని ఆమె నొక్కి చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, ఇంటర్నల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పివిఎస్.లక్ష్మీ అపర్ణ ఇంటర్నల్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి

భీమవరం టౌన్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆశాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలో ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరం మండలం రూరల్ గొల్లవాని తిప్ప పిహెచ్‌సిలో ఆశా డే సందర్భంగా విశాఖపట్నంలో ఈనెల 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు జరిగే మహాసభలను జయప్రదం చేయాలని గోడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు దీపిక మాట్లాడుతూ బాలింతలకు, గర్భిణులకు, ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళ్యాణి, వరలక్ష్మి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

ఆకివీడు : జనవరి 4న విశాఖలో జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభకు కార్మికులు, కార్యకర్తలు కదలి రావాలని సిఐటియు మండల కో కన్వీనర్ పెంకి అప్పారావు, కె.తవిటి నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అప్పారావు ఆశా వర్కర్ల నాయకులు మాట్లాడారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశాలు వై.రామలక్ష్మి, కరణం చిన్నమ్మ, బొగత అరుణ, గోడి యశోద, గోడి రమ్య, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లురూరల్: ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సంఘం జిల్లా కార్యదర్శి చింతపల్లి లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు అఖిలభారత సిఐటియు మహాసభ జయప్రదం కావాలని కోరుతూ హెల్త్ సెంటర్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. లక్ష్మి మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా ఆశాల వేతనాలు పెరగడం లేదన్నారు. విశాఖలో ఈనెల 31 నుండి జనవరి 4 వరకు జరిగే మహాసభలలో ఆశా సమస్యలపై చర్చించి పరిష్కారంకై కార్యక్రమం రూపొందించుకొని తీర్మానలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభలో ఆశాలు పాల్గొనాలని లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.నిర్మల కుమారి, పిహెచ్‌సి నాయకులు బి.కృపమేరీ, పి.విజయ దుర్గ, బి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండల కార్మిక సంఘాల ఆధ్వర్యాన సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. మహాసభ జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నేత సూర్నీడి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాదుషా, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కె.సుబ్బరాజు, సిఐటియు మండల కన్వీనర్ నేతల చిత్తరంజన్, కో కన్వీనర్ ప్రశాంతి, సానబోయిన పార్వతి, అంగన్వాడీ ప్రతినిధులు భవాని, సాయి మహాలక్ష్మి, నాగమణి, లలిత పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని లోక్ అదాలత్ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు కక్షిదారుల మధ్య రాజీ అవటానికి కృషిచేయాలని పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేసుల రాజీకి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్‌శ్రీ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ పోలీసులు, గణపవరం, చేబ్రోలు, నల్లజర్ల, పెంటపాడు, నిడమర్రు పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం : ఈనెల 13వ తేదీన నరసాపురం అన్ని కోర్ట్ సముదాయాలలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, అందుకు న్యాయవాదులు, పోలీస్ అధికారులు సహకరించాలని నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమాకు సంబంధించిన కేసులు, సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు ఉభయ కక్షిదారులను సమన్వయ పరిచి రాజీ చేయబడునని, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన ప్రీ లిటిగేషన్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. సమయాన్ని, డబ్బును వృధా చేసుకోకుండా త్వరితగతిన కేసుల నుండి విముక్తి పొందడానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జెసి టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం భీమవరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మీసేవ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సందర్శించి భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏవిధంగా జరుగుతున్నది, ఏమైనా ఇబ్బందులు ఉన్నయా అని ఎంక్వయిరీ చేశారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ ఏ విధంగా పనిచేస్తుంది పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అక్రమ రిజిస్ట్రేషన్లకు తావివ్వకుండా నిజాయితీగా పనిచేయాలని సూచించారు.

మీసేవ కేంద్రం ఆకస్మిక తనిఖీ

అనంతరం పక్కనే ఉన్న మీసేవ కేంద్రాన్ని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. మీసేవ కార్యాలయంలో జరుగుతున్న సర్వీసుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్‌కు అవసరమైన ఆదాయం, నివాస, కుల ధ్రువీకరణ, జనన మరణ ధ్రువపత్రాలు, ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ధరలు పట్టిక తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, సబ్ రిజిస్ట్రార్ టి.ప్రసాద్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

నరసాపురం: బాల్య వివాహ్ ముక్తి భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములదీవి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్.దుర్గా భవాని మాట్లాడుతూ బాల్యవివాహాలు అనర్ధాలను తెచ్చిపెడతాయని, బాల్యవివాహాలు చేసుకోరాదని సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.నెహెమియ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించారు.

CHANGE OF NAME

I, **PENMATSA LEELA SUSHMA DEVI,** W/o. PENMATSA SAI DILIP KUMAR VARMA, Flat no : A2, Lakshmi Ganapathi Residency, Rajendhara Nagar, Palakol, W.G.Dist, A.P. I have changed my name **from DANTULURI LEELA SUSHMA DEVI** (Old name) to **PENMATSA LEELA SUSHMA DEVI (New name)** hence forth I am being called **PENMATSA LEELA SUSHMA DEVI** W/o. PENMATSA SAI DILIP KUMAR VARMA for all purposes

CHANGE OF NAME

I **MUTYALA HARIBABU** S/o Mutyala Pullayya, D.No: - 3-48, Chaganti vari Meraka, Lakshmaneswaram, Narasapuram Mandal, W.G.Dt, A.P., I have changed my Name from **MUTHYALA HARIBABU** (Old Name) to **MUTYALA HARIBABU** (New Name). Henceforth I am being called **MUTYALA HARIBABU** S/o Mutyala Pullayya, for all purposes.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం కాపులపాలెంకు చెందిన అడ్డాల వాసు తండ్రి : ఆదినారాయణ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. ఇంటి దగ్గర నుండి కచేరి సెంటర్‌కు వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : P1970420 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

అడ్రస్ : **అడ్డాల వాసు,**
తండ్రి : ఆదినారాయణ, కాపులపాలెం,
ఆచంట మండలం, పిన్ : 524123
సెల్ : 7093117564

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరం గ్రామ కాపురస్తులైన కండవల్లి ప్రసాద్ తండ్రి సామ్యూల్ అను నేను నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ R0740502 గల్ల పాస్ పోర్ట్ పిప్పర గ్రామంలో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి కేశవరం వెళ్ళే మార్గ మధ్యలో ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరికలేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయగలరు.

కండవల్లి ప్రసాద్, తండ్రి సామ్యూల్
కేశవరం గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా. సెల్: 9505091554

వేలం ప్రకటన

మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.10/2024
O.S.234/2016

Between:
సమ్మెట ఝాన్సీరాణి మరియిద్దరు ...DHrs
Vs
కలపాల వరమ్మ మరి యొకరు ...J.Drs

ఈ J.Dr లచే తనఖా ఏర్పరిచిన దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థి ది.19.12.2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥ల లగాయితు పైకోర్టు వారిచే పైకోర్టులో వేలం వేయబడును. కావలసిన వారు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు :

పూర్వం కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ ఇలాకా, ఆగిరిపల్లి మండలం, పోతవరప్పాడు గ్రామంలోని లోని R.S.No.198/2A లోని ఎ 0.79 సెం మరియు R.S.No.198/2E లోని ఎ 0. 89 సెం. వెరశి ఎ 1.68 సెం భూమికి హద్దులు :
తూర్పు: మండా అబ్రహాం గారి భూమి
దక్షిణం: లింగంపల్లి ప్రకాష్ గారి భూమి
పడమర : కంభంపాటి ధర్మారావు గారి భూమి
ఉత్తరం: పోతవరప్పాడు పొలిమేర
ఈ హద్దుల మధ్యన గల ఎ 1-68 సెం భూమికి
D.Hr విలువ : రూ. 20,00,000/-
అమీనా విలువ : రూ. 30,00,000/-
వేలం తేదీ : 19.12.2025
Further hearing Date : 30.12.2025
నూజివీడు ఎన్.వి.భవాని కుమార్
ది. 17.11.2025 న్యాయవాది, నూజివీడు